andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 । కనిష్ఠం 19.8
నిర్మల్ జిల్లా వార్తలు
8
గురువారం 20 ఫిబ్రవరి 2025

22న పేరెంట్స్ కమిటీ సమావేశం : డీఈవో

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యం పాఠశాలలు ఈ నెల 22న పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని డీఈవో రామారావు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ నెల 15న సేవాలాల్ జయంతి సందర్భంగా కలెక్టర్ స్థానిక సెలవు ప్రకటించిన దృష్ట్యా ఆ రోజు నిర్వహించాల్సిన సమావేశం వాయిదా వేసినట్లు తెలిపారు. సమావేశం నిర్వహించి వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు.



సీఎంఆర్‌లో భారీ గోల్‌మాల్

- జిల్లాలో రూ.133 కోట్ల స్కాం
- 49వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాయం
- 15 రైస్‌మిల్లులపై కేసులు నమోదైన తగ్గని అక్రమాలు
- తూతూమంత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్న అధికారులు

నిర్మల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సీఎంఆర్ (కస్టమ్‌మిల్లింగ్ రైస్) పేరిట భారీస్కాం చోటు చేసుకుంది. జిల్లాలోని పలు రైస్‌మిల్లుల యజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి పథకం ప్రకారం ఈ అక్రమాలకు తెర తీశారు. అయితే 2001 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ప్రతి ఖరీఫ్, రబీసీజన్‌లలో రైస్‌మిల్లర్లు యథేచ్ఛగా సీఎం ఆర్ విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నప్పటికీ వారిపై నిర్దిష్టమైన చర్యలు కరువయ్యాయి. దీంతో కొంతమంది మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి దాదాపు నాలుగేళ్ల నుంచి ఈ అక్రమాల పరంపరను నిర్భయంగా కొనసాగిస్తున్నారు. తమకున్న రాజకీయ పలుకుబడి, పరపతితో సం బంధిత అధికారులపై ఒత్తిళ్ళు తీసుకువస్తూ ఎలాంటి చర్య లు జరగకుండా చూస్తున్నారంటున్నారు. ఇటు కొంతమంది అధికారుల అండదండలు, రాజకీయ దన్నుతో రైస్‌మిల్లర్లు కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడుతున్నప్పటికి ఇలాం టి దందాలపై నిఘా సారించాల్సిన విజిలెన్స్ విభాగం సైతం మిన్నకుండిపోవడం చర్చకు తావిస్తోందంటున్నారు. నిర్మల్ జిల్లాలో కొద్ది రోజుల క్రితం అధికారులు 15 రైస్‌మిల్లులపై కేసులు సైతం నమోదు చేశారు. ఈ రైస్‌మిల్లుల్లో 48,500 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు నిరూపితమైంది. అయితే ఈ వ్యవహారం కోర్టుకెక్కడంతో రైస్‌మిల్లర్లపై కేసుల నమోదుకే చర్యలు పరిమితమయ్యాయే తప్పా వారికి శిక్షలు గానీ, జరిమానాలు గానీ ఖరారు కాలేదు. కాగా ఇప్పటి వరకు జిల్లాలో 49వేల మెట్రిక్ టన్నుల అన్ని సీజన్లకు కలిపి ధాన్యం లెక్కలు గల్లంతయ్యాయి. కొంతమంది రైస్‌మిల్లర్లు తమ మిల్లులపై కేసులు నమోదైతే వారు మళ్ళీ బినామీల రూపంలో కొత్త రైస్‌మిల్లులను స్థాపించి ఈ సీఎంఆర్ అక్రమాల పరంపరను కొనసాగిస్తున్నారంటున్నారు. 2024 సంవత్సరంలోనే జిల్లాలో కొత్తగా 15 రైస్‌మిల్లులు ఏర్పాటయ్యాయంటే పరిస్థితి ఏ మేరకు అదుపు తప్పిపోయిందో తేటతెల్లమవుతోంది.


తిరుపెల్లి గ్రామంలో రైస్‌మిల్లులో అక్రమంగా తరలించేందుకు లోడ్ చేసిన ఉంచిన లారీ (ఫైల్)

భారీ బకాయిల్లో ఏడు రైస్‌మిల్లులు

కాగా సీఎంఆర్ కింద మిల్లింగ్ చేసిన ధాన్యానికి సంబంధించి పౌర సరఫరాల శాఖకు బియ్యాన్ని ఇవ్వాల్సి ఉన్న ఏడు రైస్‌మిల్లులు ఇప్పటి వరకు పెద్ద ఎత్తున బకాయిలు ఉండడం గమనార్హం. జోహర్‌పూర్‌లోని రాజరాజేశ్వర రైస్‌మిల్లు రూ.8.53.65 కోట్ల విలువైన 2091.152 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం బకాయి తేలింది. ఈ రైస్‌మిల్లుకు సీఎంఆర్ బియ్యాన్ని చెల్లించాలంటూ అధికారులు నోటీసులు జారీ చేశారు. అలాగే చింతకుంటలోని జాశ్రీత రైస్‌మిల్లు 5910.866 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. దీని విలువ రూ.24.12.93.300 కోట్ల రూపాయలుగా నిర్ధారించారు. అయితే ఈ రైస్‌మిల్లుపై నిబంధనల ప్రకారం 25 శాతం పెనాల్టీతో పాటు 12 శాతం వడ్డీ కలిపి జరిమానా విధించారు. అలాగే భైంసా మండలం దేగాంలోని రాజరాజేశ్వర రైస్‌మిల్లు 7381.825 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాలి. దీని విలువ దాదాపు రూ. 30.13 కోట్లుగా ఉంటుంది. బాసర మండలం కిర్గుల్ గ్రామంలోని అక్షయ రెడ్డి రైస్‌మిల్లు 7985.763 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్‌ను ఇవ్వాల్సి ఉంది. దీని విలువ రూ. 32.59.95 కోట్లుగా అధికారులు చెబుతున్నారు. అలాగే బీరవెల్లిలోని సాయికృప రైస్‌మిల్లు 6814.786 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా దీని విలువ రూ. 27.81.93 కోట్లుగా అధికారులు వెల్లడించారు. అలాగే లోకేశ్వరం మండలం ధర్మోరా గ్రామంలోని వెంకటేశ్వర రైస్‌మిల్లు 1156.333 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. దీని విలువ దాదాపు రూ. 4.72 కోట్ల వరకు ఉంటుంది. కాగా చించోలి (బి)లోని అన్నపూర్ణ అగ్రో ఇండస్ట్రీస్ కూడా 1111.492 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాలి. దీని విలువ రూ. 4.53.70 కోట్ల వరకు ఉంటుంది. ఇంత పెద్ద మొత్తంలో అక్రమాలకు పాల్పడి బకాయిలు నిర్ధారణ అయినప్పటికి ఈ రైస్‌మిల్లులపై మాత్రం ఇప్పటి వరకు తూతూ మంత్రపు చర్యలతోనే సరిపెడుతుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ధాన్యంలోనూ భారీ చేతివాటం

సీఎంఆర్ బియ్యంతో పాటు సీఎంఆర్ ధాన్యానికి సంబందించి కూడా పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అవుతోంది. చాక్‌పెల్లి గ్రామంలోని శ్రీ రామ అగ్రో రైస్ మిల్లులో 4456.911 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు స్వయంగా అధికారులే వెల్లడిస్తున్నారు. అలాగే మాటేగాంలోని ఓంకారేశ్వర రైస్‌మిల్లులో 1865.372 మెట్రిక్ టన్నుల ధాన్యం, దేగాంలోని వెంకటలక్ష్మి నర్సింహ రైస్‌మిల్లులో 1123.182 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు అధికారులు నిర్ధారించారు. అయితే ఇంత పెద్దమొత్తంలో ధాన్యం మాయమైనప్పటికి ఈ మూడు రైస్‌మిల్లులపై ఇప్పటి వరకు అధికారులు చర్యలు తీసుకోవడం గానీ, కేసులు నమోదు చేయడం గానీ జరగలేదంటున్నారు. అలాగే నర్సాపూర్(జి)లోని అనంత అగ్రో ఇండస్ట్రీస్ 3191 మెట్రిక్ టన్నుల ధాన్యం, దేగాంలోని ఆదిత్య మోడ్రన్ రైస్‌మిల్లు 1912 మెట్రిక్ టన్నుల ధాన్యం, కడెం మండలం లక్ష్మీపూర్‌లోని రాఘవేంద్ర రైస్‌మిల్లు 515 మెట్రిక్ టన్నుల ధాన్యం, లక్ష్మణచాంద మండలం తిరుపెల్లి గ్రామంలోని ప్రతిమా రైస్‌మిల్లులో 1789 మెట్రిక్ టన్నుల ధాన్యం అలాగే ఇదే మండలంలోని తిరుపెల్లి గ్రామంలో గల నిర్వాణ రైస్‌మిల్లులో 350 మెట్రిక్ టన్నుల ధాన్యం కనిపించకుండా పోయినట్లు దీనికి సంబందించిన లెక్కలు కూడా గల్లంతైనట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ధాన్యానికి సంబందించి కొనుగోలు టెండర్ జరిగిన 872 మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా ఈ రైస్‌మిల్లు నుంచి మాయమైందని అధికారులు నిర్ధారిస్తున్నారు.

అక్రమార్కులపై చర్యలు తప్పవు

కిరణ్‌కుమార్, జిల్లా సివిల్ సప్లై అధికారి

ఈ విషయమై జిల్లా సివిల్ సప్లై అధికారి కిరణ్ కుమార్‌ను సంప్రదించగా అక్రమార్కులపై చర్యలు తప్పవన్నారు. జిల్లాలో రైస్ మిల్లుల్లో తనిఖీ నిర్వహించగా... సీఎంఆర్ రైస్‌కు సంబంధించిన ధాన్యం లేకపోవడంతో సదరు 15 రైస్ మిల్లులపై రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసేందుకు సిఫారసులు చేశామన్నారు. సీఎంఆర్ రైస్ విషయంలో అక్రమాలకు పాల్పడే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

11 కేవీ విద్యుత్‌వైర్లు తగిలి ఒకరి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సోన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఐచర్‌వ్యాన్‌లో మోరే చంద్రకాంత్(24) పసుపును నింపుతుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ కరెంట్ వైర్లు తగిలి గాయాలయ్యాయి. కాగా మోరే చంద్రకాంత్‌ను ఆసుపత్రికి తరలించగా దారిలో మరణించాడు. మృతుడి తండ్రి నాగోరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోన్ ఎస్సై కే. గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కనకాపూర్ వద్ద ప్రమాదంలో
యువకుడికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు.. గాయాలపాలైన కస్తూరిరాజు

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాపూర్‌లో గల పెట్రోల్ పంపు వద్ద బుధవారం జరిగిన యాక్సిడెంట్‌లో నర్సాపూర్‌కు చెందిన యువకుడు కస్తూరిరాజు తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం నిర్మల్ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న కస్తూరి రాజు బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించటంతో నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కనకాపూర్‌లో సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి

తరచుగా ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా కనకాపూర్ చౌరస్తాలో సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. 222 జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా వెళ్లే అవకాశం ఉందని అలాగే నాలుగు వైపులా వాహనాలు వచ్చి రద్దీ ఏర్పడే అవకాశం ఉన్న దృష్ట్యా సిగ్నలింగ్ అత్యవసరమని స్థానికులు పేర్కొంటున్నారు.

అడవిపందుల దాడిలో
మొక్కజొన్న పంట నష్టం

కుంటాల, ఫిబ్రవరి, 19 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక సంతోష్ అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంటను మంగళవారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. రాత్రి వేళలో గుంపు గుంపులుగా వచ్చి మొక్కజొన్న పంటను నేలమట్టం చేశాయి. తనకున్న నాలుగెకరాలలో మొక్కజొన్న పంట సాగు చేయగా దాదాపు ఎకరం మొక్కజొన్నను నష్టపరిచినట్లు, రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్
పాఠశాల స్థలాన్ని పరిశీలించిన ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్పెషల్ అధికారి కృష్ణ ఆదిత్య, కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. మండలంలోని సిర్గాపూర్ శివారులో 17.09 గుంటల భూమిని కేటాయించారు. స్కూల్ నిర్మాణానికి స్థలం అనుకూలంగా ఉందా లేదా అనేది పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేసేందుకు అధికారులు బుధవారం స్థల పరిశీలనకు వచ్చారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి, నిర్మల్ ఈఈ అశోక్, డీఈ గంగాధర్, ఏఈ తుకారాం, దిలావర్‌పూర్ తహసీల్దార్ స్వాతి, ఎంఆర్‌ఐ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.


సిర్గాపూర్ శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, కలెక్టర్ అభిలాష అభినవ్

విద్యా కమిషనర్‌కు కలెక్టర్ పూల మొక్క అందజేత

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ల సమావేశానికి హాజరయ్యేందుకు ఇంటర్ విద్యా కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య జిల్లా కేంద్రానికి విచ్చేశారు. ఆయనకు కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థల సేకరణలో భాగంగా ఆయన ఆదిలాబాద్ చేరుకున్నారు.

అంగన్‌వాడీల ఉన్నతీకరణకు చర్యలు తీసుకుంటాం

- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల ఉన్నతీకరణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. అంగన్‌వాడీ అభివృద్ధి, ఉన్నతీకరణ, తదితర అంశాలపై సంక్షేమశాఖ జేడీ బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా జిల్లా కలెక్టరేట్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఎప్పటికప్పుడు అంగన్‌వాడీలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీడీపీవో నాగలక్ష్మి, సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూలును వంద శాతం పూర్తి చేయాలి

పన్ను వసూలును వంద శాతం పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ పట్టణంలో వివిధ కాలనీలలో జరుగుతున్న పన్నుల వసూలు, వాణిజ్య లైసెన్స్‌ల పునరుద్ధరణ ప్రక్రియను మున్సిపల్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఆస్తి పన్నుతో సహా అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించాలని వ్యాపారస్తులకు సూచించారు. నిర్ణీత గడువులోగా వాణిజ్య లైసెన్స్‌లను పునరుద్ధరించుకోవాలన్నారు. సకాలంలో పన్నులను చెల్లించని వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దివ్య గార్డెన్ సమీపంలోని అర్బన్ పార్క్‌ను పరిశీలించి పార్క్ అభివృద్ధికి పలు కీలక సూచనలు చేశారు. ప్రజలను ఆకట్టుకునే విధంగా పార్క్‌ను తీర్చిదిద్దాలన్నారు. పార్క్ సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డీఈ హరిభువన్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రుణాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు అందించే రుణాల మంజూరులో ఆలస్యంచేయకూడదన్నారు. వివిధ రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబంధిత రుణాలను అందజేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల బ్యాంకు సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. విస్తృత అవగాహన ద్వారానే సైబర్ నేరాలను నియంత్రించవచ్చునని తెలిపారు. ఇప్పటి వరకు ప్రజలకు బ్యాంకులో అందజేసిన రుణాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశం అనంతరం అదనపు కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా పొటెన్షియల్ లింకుడ్ క్రెడిట్ ప్లాన్ 2025-26 సంచికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, నాబార్డు డీడీఎం వీరభద్రుడు, డీఆర్డీవో విజయలక్ష్మి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ రామారావు, ఆర్బీఐ ఎల్బీవో దేవ్‌జిత్ బారువ, జిల్లా అధికారులు, బ్యాంకర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


క్రెడిట్ ప్లాన్ సంచికను ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో రత్నకల్యాణి

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆర్డీవో రత్న కళ్యాణి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ సోమ శ్రీనివాస్, వేణుగోపాల్, ఇన్‌చార్జి హెడ్ మాస్టర్ పురుషోత్తం, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి


మాట్లాడుతున్న శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నరేందర్‌రెడ్డిని గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు కోరారు. బుధవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్ రెడ్డిని పార్టీ ప్రకటించిందన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన అనేక హామీలు అమలు చేస్తోందన్నారు. మాజీ మంత్రి ఐకేరెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అర్జుమన్ అలీ, ఏ. మల్లారెడ్డి, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఐరా నారాయణరెడ్డి, సారంగాపూర్ ఏఎంసీ అబ్దుల్ హాదీ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, అప్పాల గణేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దృష్టి లోప నివారణకు కంటి పరీక్షలు

- జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డా.రాజేందర్



భైంసా, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దృష్టి లోప నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కంటి పరీక్షలు నిర్వహిస్తోందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా. రాజేందర్ తెలిపారు. బుధవారం భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో డివిజన్ పరిధిలోని విద్యార్థులకు కన్ఫర్మేషన్ ఆఫ్ రిఫ్రాక్టివ్ ఎర్రర్స్ పరీక్షలు ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతేడాది ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య,ఆరోగ్య శాఖ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద రెండు విడుతలుగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో కంటి వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. అప్తాల్మిక్ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన వైద్యశిబిరంలో కంటి పరీక్షలు నిర్వహింపచేయగా జిల్లాలోని 1,385 మందికి విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లుగా గుర్తించడం జరిగిందన్నారు. వైద్య విధాన పరిషత్ డీసీహెచ్‌వో డా. సురేష్, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డా. కాశీనాథ్, నేత్ర వైద్య నిపుణులు డా.రజిత, అప్తాల్మిక్ అధికారి డా. సురేష్ , ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి డా.మతీన్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

హిందూ వాహిని ఆధ్వర్యంలో శోభాయాత్ర

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని హిందూ వాహిని ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో భారీ శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక గోపాలకృష్ణ మఠం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల గుండా కొనసాగగా.. యువకులు పెద్దఎత్తున తరలివచ్చారు. జైశివాజీ నినాదాలతో హోరెత్తించారు. చేతుల్లో శివాజీ జెండాలు పట్టుకుని.. గీతాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. కాగా, ఆదిలాబాద్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కన్నుల పండువగా జరిగాయి. మరాఠా ధిరిడే కుంబీ సమాజ్, హిందూ వాహిని, నవయుక్త శక్తి ఆధ్వర్యంలో వేర్వేరుగా వేడుకలను జరిపారు. పట్టణంలోని పురవీధుల్లో భారీ శోభాయాత్ర చేపట్టారు. ఈ శోభాయాత్రలో కేఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 11వ రాష్ట్ర స్థాయి యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అండర్-18 మహిళా విభాగంలో బుధవారం హైజంప్‌లో గోల్డ్ మెడల్, డిస్కస్‌త్రోలో కాంస్యం సాధించగా, నూనావత్ రాణి డిస్కస్‌త్రోలో రజతం సాధించారు. దీంతో వీరిని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, పీడీ సౌమ్య, పీఈటీలు, కళా శాల అధ్యాపకులు అభినందించారు.

ఖోఖోలో కప్ గెలవడం గర్వకారణం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించి భారత జట్టుకు ఖోఖోలో ప్రాతినిథ్యం వహించి కప్ గెలవడం గర్వకారణమని పోస్టల్ ఎస్పీ దేవారెడ్డి సిద్ధార్థ అన్నారు. ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీసులో పోస్టల్ అసిస్టెంట్‌గా స్పోర్ట్స్ కోటాలో సాయిపోతిరెడ్డి శివరెడ్డి ఖోఖోలో ప్రపంచ కప్‌లో పాల్గొని విజయం సాధించి తిరిగి ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. బుధవారం వినాయక్‌చౌక్ తపాల ఉద్యోగులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి బ్యాండ్ మేళా మధ్య జాతీయ జెండాలను చేత పట్టుకొని కార్యాలయం వరకు స్వాగతించారు. అనంతరం ఆయన్ను ఎస్పీ సత్కరించి మోడల్స్‌ను అందించారు. అదే విధంగా జూడో విభాగంలో ఇంటర్నేషనల్ క్రీడాకారిణి మల్లప్రభ కూడా ప్రతిభ చాటారని గుర్తు చేస్తు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ గంగాధర్, సిబ్బంది ఉత్తం కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

ఉషూ క్రీడాల అభివృద్ధికి కృషి చేస్తాం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉషూ క్రీడలను మరింత అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్ అన్నారు. బుధవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉషూ రాష్ట్ర క్రీడపోటీలను నిర్వహించారు. దానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు చేసిన విన్యాసాలు అబ్బురపర్చారు. కాగా ఉషూ విభాగంలో స్పోర్ట్స్ కింద పోస్టల్ శాఖలో ఉద్యోగం రాగ ఆమె ఎస్ఎస్‌ఓలో శిక్షణ తీసుకుంటున్న రాథోడ్ స్వాతిని సత్కరించారు. ఈ సందర్భంగా ఉషూ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడారు.

వేసవిలో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలి

● రాష్ట్ర సెక్రెటరీ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య ● ఆదిలాబాద్‌లో ఉమ్మడిజిల్లా కలెక్టర్లతో సమావేశం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర సెక్రటరీ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటి సమస్యలు, కరెంట్ కోతలకు సంబంధించి గతంలోని అనుభవాలను పరిగణనలోకి తీసుకొని కార్యచరణ రూపొందించాలన్నారు.

● పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో ఇంటర్మీడియెట్ విద్యపై ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణా ఆదిత్య సమీక్షించారు. సీసీ కెమెరాల గురించి మాట్లాడి, ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా జరపాలని అన్నారు. థియరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈఓ సి.రవీందర్ కుమార్‌ను ఆదేశించారు. ఏజీఎంసీ జిల్లా అధికారులతో కళాశాలలో హాజరు శాంత, స్లిప్ టెస్టులు, అడ్మిషన్ డ్రైవ్ గురించి అడిగి తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న ఎడ్యుకేషన్ కమిషనర్ కృష్ణ ఆదిత్య

'బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు ప్రజా సమస్యలు పట్టవు'

తలమడుగు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు పదవులు తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోరని, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో నియోజకవర్గంలోని మూడు మండలాలు తాంసి, తలమడుగు, భీంపూర్‌ల ముఖ్య నాయకులక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడె గజేంద్ర మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ ఎంపీ, నలుగురు ఎమ్మెల్యేలు గెలిచినప్పటికీ కేంద్రం నుంచి ఇలాంటి నిధులు తేవడం లేదన్నారు. బీజేపీ నాయకులకు పదవులు తప్ప ప్రజా సమస్యలు పట్టవన్నారు. నీటి వల్ల నిర్వహించిన కేంద్ర బడ్జెట్‌లోను జిల్లాకు ఎలాంటి నిధులు తీసుకురాకపోవడం దురదృష్టకరమన్నారు. అదేవిధంగా గత పది సంవత్సరాల పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యలను పట్టించుకోలేదు అన్నారు. ప్రజలు పట్టించుకోకపోవడంతో ఎంపీ ఎన్నికల్లో డిపాజిట్ రాకుండా ఓడిపోయింది అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లోను ఓడిపోతామని భయంతోనే ఎన్నికల్లో పాల్గొనలేదన్నారు. అదేవిధంగా ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విజయం కోసం ప్రతీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, నాయకులు పక్క ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. పట్టభద్రులందరిని ఇంటింటికీ వెళ్లి కలుస్తూ వారి మద్దతు కూడా గట్టాలని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని వారందరికీ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, తలమడుగు మాజీ జడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, బాబాన్న, తలమడుగు, తాంసి, భీంపూర్ మండల అధ్యక్షుడు కల్యాణం రాజేశ్వర్, కౌడాల నారాయణ, అశోక్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, మండలాల యూత్ అధ్యక్షుడు సాయి చరణ్, అశోక్, ముష్రాన్, పార్టీ సీనియర్ నాయకులు, తదితరులున్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్

24న సేవాలాల్ జయంతి

నార్నూర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో ఈనెల 24వ తేదీన సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవ వేడుకలు ఉన్నందున బంజారా సమాజం ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని బి.గజానంద్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఎంపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. వారి వెంట నాయకులు సురేష్ ఆడె, దిగంబర్ ఆడె, సికేందర్ రాథోడ్, యశ్వంత్ రావు చౌహాన్, ప్రకాష్, తదితరులు ఉన్నారు.

'బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి'

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలో ఈ నెల 27వ తేదీన జరిగే గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీల ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులైన అంజిరెడ్డి చిన్నమిలే, మరియు టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య గారికే మొదటి ప్రాదన్యత ఇచ్చి వారిని బారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులు కోరారు. ఇందులో మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్, సీనియర్ నాయకులు అల్కె గణేష్, మాజీ జడ్పీటీసీ కొత్త శంకర్, తదితరులున్నారు.

పలు పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పని చేసి కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందించాలని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి బలమని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని ప్రజా సేవా భవన్‌లో జరిగిన పార్టీ చేరికల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సమక్షంలో పలువురు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని నిషాన్ ఘాట్‌లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న పేదలకు కరెంట్ సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట పేదలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఏండ్ల నుంచి నివాసం ఉంటున్న కనీస సౌకర్యం అయిన కరెంట్ ఇవ్వాలని నినాదాలు చేశారు.

అడ్డగోలు దందా

(5వ పేజీ తరువాయి...)

కూడా ఫేక్ డోర్ నెంబర్లను జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు అధికారులు వేలల్లో ఫేక్ డోర్ నెంబర్లను కేటాయించినట్లు తెలుస్తుంది. తాజాగా భాగ్యనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వెంచర్‌లో 3-1-221/1/4 డోర్ నెంబర్‌ను కేటాయించి 30/40 ఓపెన్ ప్లాట్‌ను అడ్డ దారిలో రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా ఆదిలాబాద్ సబ్ రిజిస్టర్ పరిధిలో నిత్యం పదుల సంఖ్యలో నిత్యం అక్రమ మార్గంలో జరుగుతున్నట్లు తెలుస్తుంది.



గతేడు మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన ఇల్లీగల్ లే అవుట్ల వివరాలు

అవినీతి దందాకు అడ్డా

అవినీతి దందాకు అదిలాబాద్ సబ్ రిజిస్టర్ కార్యాలయం అడ్డాగా మారింది. అడిగినంత ఇస్తే ఏదైనా సాధ్యమేనంటూ సబ్ రిజిస్టర్ అధికారులు నిరూపిస్తున్నారు. ఇల్లీగల్ వెంచర్‌లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయవద్దంటూ మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను పక్కనపెట్టి సబ్ రిజిస్టర్ అడ్డదారిలో డోర్ నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేస్తూ దండుకుంటున్నారు. దొరికితే దొంగ.. లేదంటే దొర అన్నచందంగా సబ్ రిజిస్టర్ కార్యాలయ అధికారుల తీరు కనిపిస్తోంది. అదునుచూసి అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ లు చేయడం సబ్ రిజిస్టర్ అధికారులకు అలవాటుగానే మారింది. ఒక్కో ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో కొందరు డాక్యుంట్ రైటర్‌లు చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి మున్సిపల్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారడంతో అమాయక జనం తీవ్రంగా నష్టపోతున్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి బాసట

బోథ్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి చెందిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు పాఠశాలలో విధులు నిర్వహించి ఇంటికి వెళుతుండగా గుండెపోటుతో మృతి చెందడం జరిగింది. అయితే నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన కుటుంబాన్ని ఆర్థికంగా చేయూత నివ్వాలన్న దృక్పథంతో పాఠశాల విద్యార్థులు, పోషకులు రాష్ట్రంలోని మోడల్ స్కూల్ సిబ్బంది కలసి ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయానికి వచ్చారు. దీంతో రూ.1,51,121 సమకూర్చి ఉపాధ్యాయుడి ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయాన్ని అందించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

● ఇంటి నుంచి వెళ్లిన ఇరవై రోజులకు శవంలా..

ఇచ్చోడ/ నేరడిగొండ/బోథ్, ఫిబ్రవరి, 19(ఆంధ్రజ్యోతి): కడెం నదిలో మృతదేహం లభ్యమైన సంఘటన నేరడిగొండ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరడిగోండ మండలంలోని గాజిలి గ్రామశివారులోని కడెం నదిలో తెలియడుతున్న గుర్తుతెలియని మృతదేహం లభించింది. మృతదేహన్ని బయటకి తీసి విచారణ జరిపిన పోలీసులు మృతదేహం ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన మర్సకొల ఆనంద్(50)గా గుర్తించారు. ఆనంద్ మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో 20రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన ఆనంద్ కడెం నదిలో శవమై కనిపించాడు. మృతుడు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. పొస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహం అందజేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

ఉట్నూర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా గోవింద్ నాయక్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరామర్శించారు. దండేపల్లి మండలం లింగపూర్ గ్రామంలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న గోవింద్ నాయక్‌ను కలిసేందుకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆయన ఇంటికి వెళ్లారు. ఆరోగ్య పరిస్థితులు, యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాయక్ దంపతులను శాలువాతో సత్కరించారు.

కళాకారులకు జాతీయ పురస్కారాలు ప్రదానం



పురస్కారాలు అందుకున్న కళాకారులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో పలువురు కళాకారులకు జాతీయ పురస్కారాలు అందజేశారు. మంగళవారం రాత్రి లయన్స్ క్లబ్‌లో తెలంగాణ రచయితల వేదిక, డాక్టర్ కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కే. మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హన్మంతు, కావేరి ఫౌండేషన్ చైర్మన్ అప్పాల చక్రధారి, గౌరవ అధ్యక్షులు యూ. కృష్ణం రాజు, డాక్టర్ దామెర రాములు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మోటివేషన్ తరగతులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : డిపో ఆర్టీసీ ఉద్యోగులకు బుధవారం మోటివేషన్ తరగతులను పవర్ శిక్షణ ఆదిలాబాద్ ఆర్ఎం సోలోమన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ... కార్మికులు సంస్థ తమదన్న భావనతో పని చేసి ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలన్నారు. సంస్థ అభివృద్ధికి సమిష్టిగా పాటుపడాలని, సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్నారు. మేనేజర్ ప్రతిమారెడ్డి, సహా మేనేజర్ రాజశేఖర్, ఏఈ నవీన్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

శివాజీనగర్ అధ్యక్షుడిగా కరిపే శ్రీనివాస్ ఎన్నిక

ఖానాపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : శివాజీ నగర్ కాలనీ అధ్యక్షులుగా ఖానాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపే శ్రీనివాస్ ఎన్నికయ్యారు. బుధవారం శివాజీ నగర్ కాలనీలో నిర్వహించిన కాలనీ పెద్దల సమావేశంలో శ్రీనివాస్‌ను గౌరవ అధ్యక్షులుగా సూర్య ప్రకాష్‌రెడ్డిని, శివాజీనగర్ యూత్ అధ్యక్షులగా మనోజ్ కుమార్ అలియాస్ చింటూను ఆ కాలనీ వాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కరిపే శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు సూర్యప్రకాష్ రెడ్డి, యూత్ అధ్యక్షులు మనోజ్ కుమార్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కరిపే శ్రీనివాస్ మాట్లాడుతూ... పార్టీలకతీతంగా కాలనీ అభివృద్ధి కోసం అందరితో కలిసికట్టుగా పని చేస్తానని పేర్కొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

కడెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన బీజేపీ రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్‌ను కడెం మండల కేంద్రంలోని హరితరిసార్ట్‌లో సన్మానించారు. బుధవారం బీజేపీ మండల అధ్యక్షులు కాశవేణి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి సన్మానించారు. నాయకులు పూస శ్రీరామ్, ధీరజ్, గంగాధర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఎస్సై

కడెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కడెం మండలంలోని పాండ్వాపూర్ ఫారెస్ట్ చెక్‌పోస్ట్ దగ్గర విధులు నిర్వహిస్తున్న దస్తురాబాద్ హెడ్ కానిస్టేబుల్ గోకుల్ దాస్ హార్ట్ ఎటాక్‌తో కుప్పకూలి పోయాడు. వెంటనే అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కడెం ఎస్సైకి సమాచారం అందించారు. ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి హుటాహుటిన అక్కడికి చేరుకొని సీపీఆర్ చేశారు. అనంతరం పోలీసులు ఖానాపూర్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్ తరలించారు.

శివాజీ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి

● ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నిర్మల్ జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న శ్రేణులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : శివాజీ మహరాజ్ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు పట్టణ ప్రధాన రహదార్ల నుండి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏలేటి మాట్లాడుతూ... హిందూ ధర్మ పరిరక్షణ కోసం చిన్న వయసులోనే మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారన్నారు. దేశం ధర్మం కోసం ఊపిరి ఉన్నత కాలం పోరాటం చేసిన మహనీయుడన్నారు. శివాజీ సేవా సమితి అధ్యక్షులు మేడిసెమ్మె రాజు, తెలంగాణ గోసేవా ప్రముఖ్ వెంకట్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డి, బీజేపీ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, సత్యనారాయణగౌడ్, జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, ఇతర వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంతో పాటు పట్టణంలోని మంజులాపూర్, రూరల్ మండలంలోని నీలాయిపేట్‌లో ఘనంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకల్లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని, వారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముజ్గి గ్రామంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్, మాజీ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు పోలాస మల్లేష్, ఎంపీటీసీ సంతోష్, గుర్రం మధు, మహేందర్, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి



భైంసాలోని ఏపీ నగర్ కాలనీలో నిర్వహిస్తున్న శివాజీ మహరాజ్ జయంతి

భైంసా, ఫిబ్రవరి 19 : మున్సిపల్ కేంద్రమైన భైంసా పట్టణంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక శివాజీ చౌక్‌లో హిందూవాహిని శ్రేణులు వేడుకలను నిర్వహించగా అరే మరాఠా సంఘంతో పాటు వివిధ సంఘాలు ఆయా కాలనీలు, వార్డులలో జయంతి వేడుకలను నిర్వహించాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఛత్రపతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


ఖానాపూర్‌లో..

ఖానాపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను పలు హిందూ సంఘాలు, శివాజీ నగర్ కాలనీ వాసుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ నగర్‌లోని శివాజీ మహరాజ్ విగ్రహానికి అభిషేకం నిర్వహించి, పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్, ఖానాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ శివాజీ నగర్ అధ్యక్షులు కరిపే శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బక్కశెట్టి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ కారింగుల సంకీర్తన, మాజీ ఉప సర్పంచ్ కారింగుల సుమన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాళ్లపెల్లి రాజ గంగన్న, సీనియర్ న్యాయవాదులు వెంకట మహేంద్ర, తోట సుమిత్, శివాజీ నగర్ కాలనీ వాసులు తదితరులున్నారు.

దిలావర్‌పూర్ మండలంలో..

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. కదిలి, మాడెగాం, సిర్గాపూర్, దిలావర్‌పూర్ గ్రామాల్లోని శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కదిలి దేవస్థానం చైర్మన్ వెంకట్‌రావు పటేల్, డైరెక్టర్ దత్తు పటేల్, మారుతిరావు పటేల్, మాడెగాం మాజీ సర్పంచ్ భుజంగ్‌రావు పటేల్, నగేష్ పటేల్, సంభాజీ పటేల్, పరుశురాం పటేల్, ఆనంద్‌రావు పటేల్, బాబా సాయి పటేల్, గుణవంత్‌రావు పటేల్, మోతాజీ పటేల్, శైలేశ్వర్, శివలింగం, హరి పటేల్, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి) మండల కేంద్రంలో..



నర్సాపూర్(జి), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే. రమేష్, నరేందర్, నవీన్, లక్ష్మణ్, రాజు, దేవేందర్, విజయ్, హరీష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్ మండలంలో..

ముథోల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని తరోడా, ఎడ్‌బిడ్, బోరిగాం, చించాల తదితర గ్రామాల్లో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి శోభాయాత్ర నిర్వహించారు. అలాగే ముథోల్‌లో ఆరె మరాఠీ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అలాగే ముథోల్‌లోని రబింద్ర ఉన్నత పాఠశాల, అక్షర, శిశు మందిర్ పాఠశాలల్లో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

కుంటాల మండలంలో...

కుంటాల, ఫిబ్రవరి, 19 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు వాసవి విద్యాసంస్థలతో పాటు పెంచికల్‌పాడ్, శాంతినికేతన్ పాఠశాల తదితర చోట్ల బుధవారం శివాజీ జయంతి ఘనంగా నిర్వహించారు.

'పేద విద్యార్థుల ఉన్నత చదువుకు తోడ్పాటునిస్తా'



విద్యార్థులతో ట్రస్టు చైర్మన్ బోస్లే మోహన్‌రావ్ పాటిల్

భైంసా, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదువుకోవాలనే ఆసక్తిగల పేద విద్యార్థులకు తమ ట్రస్టు ద్వారా అన్ని రకాల సహాయ,సహకారాలు అందించి తోడ్పాటునిస్తామని మోహన్‌రావ్ పాటిల్ ప్రజా ట్రస్టు చైర్మెన్ బోస్లే మోహన్‌రావ్ పాటిల్ వెల్లడించారు. బుధవారం భైంసా పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులందరికి తమ ట్రస్టు ద్వారా పరీక్షా ప్యాడ్ల పంపిణీ, పరీక్షలపై అవగాహన సదస్సులు నిర్వహించి మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా ట్రస్టు ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భైంసా పట్టణ కమిటీ మాజీ అధ్యక్షులు గాలి రవి, ముథోల్ మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్‌తో పాటు ట్రస్టు ప్రతినిధులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కడెం నుంచి ఎయిర్‌పోర్ట్‌కు బస్సు సౌకర్యం

కడెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఉట్నూర్ బస్ డిపో నుంచి సాయంత్రం 4:30 నిమిషాలకు బయలుదేరి కడెం, ఖానాపూర్‌కు 5:20కి చేరుకొని 5:40కి మెట్‌పల్లి, ఆర్మూర్, కామారెడ్డి, సికింద్రాబాద్ మీదుగా శంషాబాద్‌కు రాత్రి ఒంటి గంటకు చేరుకోనుంది. తిరిగి మరలా ఉదయం 6:45కి బయలుదేరి సికింద్రాబాద్, కామారెడ్డి, ఆర్మూర్, మెట్‌పల్లి మీదుగా ఖానాపూర్‌కు మధ్యాహ్నం 1 గంటలకు చేరుకొని ఖానాపూర్ నుంచి బయలుదేరి ఉట్నూర్‌కు 2:45కు చేరుకుంటుంది. ఖానాపూర్ నుండి సికింద్రాబాద్‌కు టిక్కెట్ ధర 510 ఖానాపూర్ నుండి శంషాబాద్‌కు టికెట్ ధర 540, దస్తురాబాద్, కడెం, పెంబి, ఖానాపూర్ మండలాల ప్రజలు ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోగలరు.

కడెంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కడెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కడెం, పెద్దూర్ గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ రామ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు వెల్లడించారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

వికలాంగుల నకిలీ పెన్షన్లు రద్దు చేయాలి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నకిలీ వికలాంగుల పెన్షన్లు రద్దు చేసి, సర్టిఫికెట్లు జారీ చేసిన వారిపై చర్య తీసుకోవాలని బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు డి. నూతన్ కుమార్, తిరుపతి మాట్లాడుతూ... రిటైర్డ్ టీచర్ వెంకన్న నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి దస్తురాబాద్‌లో వందలాది మందికి పెన్షన్లు ఇప్పించాడని ఆరోపించారు. వారి నుండి డబ్బులు వసూలు చేశాడని తెలిపారు.

రంజాన్ నెల సదుపాయాలు కల్పించండి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసం ప్రారంభం కానున్నందున సదుపాయాలు కల్పించాలని కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు జునైద్ మెమన్, నాయకులు బుధవారం అధికారులను కోరారు.


శిథిలావస్థకు చేరిన కుభీర్ ప్రాథమిక పాఠశాల

పనులు పూర్తి కావు.. అవస్థలు తీరవు!

● శిథిలావస్థకు చేరిన కుభీర్ ప్రాథమిక పాఠశాల భవనం
● వచ్చే విద్యాసంవత్సరానికైనా నూతన భవనం నిర్మించేనా..!?

కుభీర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కుభీర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అదనపు పాఠశాల గదుల నిర్మాణ పనులు పూర్తికాక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. స్థానిక కేజీబీవీ పాఠశాల సమీపం ఏళ్ల కిందట నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పాఠశాలలో 65 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఐదుగురు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. పాఠశాల శిథిలావస్థకు చేరటంతో పెచ్చులు ఊడుతున్నాయి. విద్యార్థులు కూర్చోలేకుండా బండలు కుంగి పోతున్నాయి. ఉన్న జాలీలు ఇనప తలుపులు తీసివేయడంతో కోతుల బెడద తీవ్రమైందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండేళ్ల కిందట నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. మన ఊరు, మన బడి ఉపాధిహామి పథకం కింద సుమారు రూ. 49లక్షల 60వేలతో రెండు గదులు, వంట గది, ప్రహరీ, మూత్రశాలలు నిర్మించాల్సి ఉంది. అయితే కేవలం రెండు అదనపు గదులు మాత్రమే పూర్తయ్యాయి. దీంట్లో ఫ్లోరింగు, విద్యుత్ సరఫరా, తలుపులు కిటికీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ విషయమై సంబంధిత ఏఈ మహేష్‌ను వివరణ కోరగా పనులు నిలిచి పోయాయని అన్నారు. ఈవిషయమై జిల్లా అధికారులకు నివేదించామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం వరకైనా విద్యార్థులకు నూతన భవనం అందుబాటులోకి తీసుకొచ్చి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని పోషకులు, గ్రామస్తులు కోరుతున్నారు.


అసంపూర్తిగా అదనపు గదులు


బ్రహ్మోత్సవాలకు హాజరైన మహిళలు, భక్తులు



తలమడుగులో ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

వైభవంగా సాగిన బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు

● భక్తిశ్రద్ధలతో శ్రీనివాస కల్యాణం ● గోవింద నామస్మరణతో మార్మోగిన తలమడుగు

తలమడుగు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రం లోని అతి పురాతనమైన వేంకటేశ్వర ఆలయంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిసాయి. గత మూడు రోజులు వేద పండితులతో యజ్ఞ కార్యక్ర మాలు యజ్ఞ పూర్ణాహుతి గరుడ వివాహం ఉంజల్ సేవ, పంచామృతంతో పంచాభిషేకం ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. బుధవారం వైభవంగా శ్రీనివాస కల్యాణం రథోత్సవం రాత్రి ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తలమడుగు గ్రామానికి చెందిన అల్లూరి సంజీవరావు సురేఖ వారి దంపతులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యక్షులు రాంరెడ్డి వెంకటేష్, రూపేష్, వ్యాపారవేత్త కాటిపెల్లి వసంత్ రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పీడుగు సంజీవరెడ్డి, ఆధ్యాత్మిక వేత్త కృష్ణ నంద స్వామీజీ సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి తహసీల్దార్, ఎంపీడీవో చంద్ర శేఖర్ నల్ల రత్నాకర్ రెడ్డి, ఆలయ వేద పండితులు రాంగోపాల్ చారి, రంగయ్య చారి. శ్రీనివాస చారి, కళ్యాణ్‌చారి, ఆశిష్‌కుమార్ పాల్గొన్నారు.


జాతరలో భక్తుల సందడి


రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అలంకార ప్రాయంగా వాష్ బేసిన్


నిరుపయోగంగా మారిన వాష్ బేసిన్

కుభీర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చేతులను శుభ్రం చేసుకునేందుకు మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన వాష్‌కు నల్లాలను ఏర్పాటు చేశారు. కాని ట్యాప్‌లు సక్రమంగా బిగించలేదు. వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసిన ట్యాంక్‌కు నీటి సరఫరా చేయలేదు. ట్యాంకు నుంచి కులాయిలకు నీటి సరఫర పైప్‌లైన్ బిగించ కుండా వదిలివేయడంతో అలంకార ప్రాయంగా మిగిలింది. వాష్ బేసిన్ పనులు వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా కుభీర్ పాఠశాల ఆవరణ


అపరిశుభ్రంగా మారిన కుభీర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ

కుభీర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ ఇలా అపరిశుభ్రంగా మారింది. పాఠశాల పరిసర ప్రాంతాలు అస్తవ్యస్తంగా అపరిశుభ్రంగా మారిన పట్టించుకునే వారు కరువైయ్యారని పోషకులు వాపోతున్నారు. ఆహ్లాదం లేక విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడాల్సిన వస్తోంది. ఇప్పటికయిన అధికారులు స్పందించి పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరుతున్నారు.



పెన్‌గంగా నది నీటి ప్రవాహానికి అడ్డుకట్టలు

● ఇసుక తవ్వకాలకు మైనింగ్ మాఫియా కొత్త ఎత్తుగడలు
● సాగునీటి కోసం దిగువ ప్రాంత రైతుల ఆందోళన

ఆదిలాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగా నది నీటి ప్రవాహనికి మైనింగ్ మాఫియా అడ్డుకట్టలు వేస్తున్నారు. వేసవి ప్రారంభం కావడంతో నదిలో నీటి ప్రవాహం కొంత తగ్గు ముఖం పట్టింది. దీంతో ఇసుక తవ్వకాలను చేపట్టేందుకు నది నీటిని మళ్లిస్తున్నారు. జైనథ్ మండలం సాంగ్వీ గ్రామ సరిహద్దుల్లో పెన్‌గంగా నదిలో ఇలా భారీ అడ్డుకట్టలు వేసి అక్రమంగా ఇసుక తవ్వకాలను చేపట్టేందుకు మైనింగ్ మాఫియా కొత్త ఎత్తుగడలు వేస్తుంది. అధికారులు దాడులు చేస్తున్న అక్రమ దందాకు అసలు అడ్డుకట్ట పడడం లేదు. రాత్రికి రాత్రే ఇసుక తవ్వకాలను చేపడుతూ అమ్మేసుకుంటున్నారు. అసుతే నది నీటిపై ఆధారపడి రబీ సీజన్లో వివిధ రకాల పంటలను సాగుచేస్తున్న దిగువన సరిహద్దు గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



లక్ష ఉద్యోగాలను భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం

● పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

కామారెడ్డి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 9 నెలల్లో 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేశామని రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పట్టభద్రులకు గుర్తు చేశారు. ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న మరో లక్ష ఉద్యోగాలను భర్తీచేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాని అదే బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో 50 వేల ఉద్యోగాలను కూడా భర్తీచేయలేక పోయిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 2లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తామని ప్రతీ ఎన్ని కల సమయంలో హామీ ఇస్తూ అధికారంలోకి వచ్చారని తీరా ఒక్క ప్రభుత్వం ఉద్యోగం కూడా భర్తీచేయడం కాదుకదా ఉన్న ఉద్యోగాలను తొలగిస్తూ బీజేపీ నిరుద్యోగులను మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. అలాంటి రెండు పార్టీలను నమ్మవద్దని ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బలపరిచిన నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య కన్వెన్షన్‌లో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ గత ఎంపీ ఎన్నికల నుంచి బీజేపీ,బీఆర్ఎస్‌ల మధ్య లోపాయికారి ఒప్పందాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ చేసిన అప్పులకు రూ.65 వేల కోట్లు వడ్డీనే చెల్లిస్తుందన్నారు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థి తుల్లోను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణలో 56శాతం బీసీలు ఉన్నట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించేందుకు త్వరలోనే చట్టం తీసుకు వస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోనుందన్నారు. అధిక మెజార్టీతో నరేందర్‌రెడ్డిని గెలిపించేందుకు కాంగ్రెస్ శ్రేణులు పట్టభద్రులతో ఓట్లు వేయించేవిధంగా క్షేత్రస్థాయిలో పర్యటించి కాంగ్రెస్ పథకాలను వివరించాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

స్థానిక సంస్థల్లో సత్తాచాటాలంటే ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రతిష్టాత్మకం : మంత్రి జూపల్లి

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకోసం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోని కాంగ్రెస్ విజయం సాధించేలా ప్రజాప్రతినిధులు కృషిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయదుందుబి మోగించేందుకు దోహదపడుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీఎన్నికల్లో ప్రతి ఓటు కీలకంగా మారుతుందన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సొంత జిల్లా అయిన ఎమ్మెల్సీ అభ్యర్థికి భారీగా ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. క్షేత్రస్థాయిలో క్యాడర్, లీడర్ కష్టపడి పనిచేసి కాంగ్రెస్ పథకాలను ఓటర్లకు వివరించి అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు.

సొంత నిధులతో రూ.3లక్షల బీమా కార్డు ఇస్తా

● నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటువేసి గెలిపిస్తే స్వంత నిధులతో నిరుద్యోగులకు పట్టభద్రులకు రూ.3లక్షల బీమా కార్డులు ఇస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. పట్టభద్రుల, ఉపాధ్యాయుల సమస్యలేంటో తనకు ఒక ఉపాధ్యాయుడిగా తెలుసన్నారు. వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కాంగ్రెస్ వచ్చిన 90 రోజుల్లోని డీఎస్సీ నోటిఫికేషన్ వేసి ఉపాధ్యాయుల పోస్టులు భర్తీచేయడంతో పాటు పదోన్నతులు కల్పించిందన్నారు. ఆ పార్టీ నుంచి బరిలో ఉన్న తనను గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, జుక్కల్ ఎమ్మెల్యే, లక్ష్మీకాంతారావు, ఎంపీ సురేష్‌షెట్కార్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ముథోల్‌లో నేటి నుంచి

అఖండ హరినామ సప్తాహ ప్రారంభం


పశుపతినాథ్ శివాలయం



సప్తాహ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

ముథోల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని పశుపతినాథ్ శివాలయంలో గురువారం నుంచి అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంబంధిత వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సప్తాహం 20 తేదీ నుంచి 27వ తేదీ వరకు జరుగనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరం గ్రామస్థులు ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశా రు. ప్రతీ సంవత్సరం శివరాత్రికి ఐదు రోజుల ముందు ఈ సప్తాహం ప్రారంభిస్తారు. శివరాత్రి పండుగ జాతర రోజున ఈ సప్తాహ ముగియనుంది. ఈ సప్తాహనికి నియోజక వర్గం నుంచే కాకుండా నిజామాబాద్, మహారాష్ట్ర నుంచి సైతం మహారాజులు, భజన దిండిలు, గురుబోధ బృందాలు రాత్రి వేళలో పాల్గొని భజనలు నిర్వహిస్తారు. ఉదయం వేళలో వేకువ జామున కాకడ హారతి కార్య క్రమాన్ని భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వాడిపోతున్న నర్సరీ మొక్కలు


వాడిపోతున్న నర్సరీ మొక్కలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అడవుల విస్తీర్ణం పెంచాలనే ఉద్దేశంతో ఆరంభించిన జాతీయ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారుల నిర్లక్ష్యం వల్ల నీరు గారిపోతోంది. మండలంలోని తుమ్మగూడ పంచాయితీలో ఏర్పాటు చేసిన నర్సరీలో వివిధ రకాల మొక్కలు నీరు అందించక, ఉపాధి హామీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మొక్కలు వాడిపోతున్నాయి. ఒక్కో నర్సరీ కనీసం 10 వేల మొక్కలు నాటేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ నర్సరీలో మొక్కలు వాడి పోతుండటంతో పెట్టుకున్న లక్ష్యం నీరు గారిపోతుంది.






వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

నీటి సరఫరాలో నిండా నిర్లక్ష్యం

ఆదిలాబాద్ పట్టణ పరిధిలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం నీటి వృథాకు కారణమవుతుంది. తాజాగా బట్టి సావర్గామ్ వెళ్లే దారిలో జ్యోతి బాపూలే బాలికల పాఠశాల వద్ద భారీఎత్తున నీరు వృథాగా పోయింది. పైపు లీకేజీ కావడంతో ఆ ప్రాంతమంతా చెరువును తలపించింది. మంచినీరు వృథాగా పోతుండడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్‌ఫోటోగ్రాఫర్)

అడ్డగోలు.. దందా



ఆదిలాబాద్‌లోని భాగ్యనగర్ కాలనీలో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్ ఇదే..

- జిల్లా కేంద్రంలో అక్రమ లే అవుట్లతో ఇల్లీగల్ దందా
- భాగ్యనగర్ కాలనీ పరిధిలో 25/2 సర్వే నెంబర్‌లో అడ్డగోలుగా ప్లాట్ల విక్రయాలు
- ఓపెన్ ప్లాట్‌లకు డోర్ నెంబర్లను కేటాయిస్తున్న మున్సిపల్ అధికారులు
- నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేస్తున్న ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్
- ప్లాట్లను కొనుగోలు చేస్తూ మోసపోతున్న అమాయక జనం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు అక్రమంగా లే అవుట్లను ఏర్పాటు చేస్తూ ఇల్లీగల్ దందా చేస్తున్నారు. అయితే డోంట్ వర్రీ అమ్మేసు కోండి అంటూ ఈ అడ్డగోలు దందాకు అధికారులే అండగా నిలుస్తున్నారు. జిల్లాకేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో సర్వే నంబర్ 25/2 లో ఏర్పాటు చేసిన వెంచర్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గతంలో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించా రు. ఈ వెంచర్‌కు ఎలాంటి అనుమతులు లేవంటూ గుర్తించి ఇందులో ప్లాట్లను ఎవరు కొనుగోలు చేయరాదంటూ హెచ్చరికలు చేశారు. అదే విధంగా గతేడు అక్టోబర్ 24న ఇల్లీగల్ వెంచర్ల సర్వే నంబర్ వివరాలతో ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గత మున్సిపల్ కమిషనర్ ప్రత్యేకంగా లేఖను కూడా రాశారు. దీంతో కొంత వెనుకకు తగ్గినట్టే తగ్గిన మళ్లీ గుట్టుచప్పుడు కాకుండా అధికారులు డోర్ రిజిస్ట్రేషన్ చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. ఇదంతా నిబంధనలకు విరుద్ధమని తెలిసినా మున్సిపల్, సబ్ రిజిస్టర్ అధికారులు బరితెగించి మరీ అడ్డదారిలో రిజిస్ట్రేషన్‌లు చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. ఒక్కో ప్లాటును రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు విక్రయిస్తున్నారు. అసలు విషయం తెలియక ఈ వెంచర్‌లో ప్లాట్లను కొనుగోలు చేసిన వారంతా ఇప్పుడు లబోదిబోమంటున్నారు.

జిల్లాకేంద్రం చుట్టూ భూ దందా

భూముల ధరలు కోట్లకు పడగెత్తడంతో జిల్లాకేంద్రం చుట్టూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు అడ్డగోలు దందాలకు ఎగబడుతున్నారు. ముఖ్యంగా మున్సిపల్ పరిసర ప్రాంతాలతోపాటు మావల, బట్టి సావర్గాం, చాందా(టీ), ఖానాపూర్ పరిధిలో అడ్డగోలుగా వెంచర్లను ఏర్పాటు చేస్తూ అమ్మేసుకుంటున్నారు. ఎంతో కొంత అనుభవం, ఆర్థిక పలుకుబడి, పరిచయాలు ఉన్న వారంతా వ్యవసాయ భూముల్లో హద్దురాళ్లను పాతేస్తూ ప్లాట్లుగా విక్రయిస్తున్నారు. ఎలాంటి కష్టం లేకుండానే తేలికగా రూ.లక్షల సంపాదించే అవకాశం ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారంలో చక్రం తిప్పు తున్నారు. జిల్లాకేంద్రం చుట్టూ ఉన్న ఖాళీ స్థలాలను చదును చేస్తూ ప్లాట్లుగా మార్చేస్తున్నారు. భాగ్యనగర్ కాలనీని ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 25/2 వ్యవసాయ భూమిలో కొందరు వ్యాపారులు ప్లాట్లను విక్రయించడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు తరచూ దాడులు చేస్తూ ఇల్లీగల్ వెంచర్లలో హద్దురాళ్లను తొలగిస్తున్నా.. అక్రమ దందాకు మాత్రం అడ్డుకట్ట పడినట్లు కనిపించడం లేదు.




● గత వారం రోజుల క్రితం ఇల్లీగల్ లేఅవుట్‌లో డోర్ నెంబర్‌తో ఓపెన్ ప్లాటును రిజిస్ట్రేషన్ చేసిన అధికారులు

జోరు ఫేక్ డోర్ నెంబర్లు

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో జోరుగా ఫేక్ డోర్ నెంబర్‌ల దందా కొనసాగుతోంది. అక్రమ వెంచర్లు ప్రభుత్వ అసైన్డ్ భూములు ఓపెన్ ప్లాట్లకు డోర్ నెంబర్లను కేటాయిస్తున్నారు. అడిగినంత ఇస్తే దేనికైనా డోర్ నెంబర్లను ఇచ్చేందుకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చేస్తున్న తప్పిదాలతోనే లేదు. ఇలా అధికారులు చేస్తున్న తప్పిదాలతోనే భూవివాదాలు తలెతుతున్నాయి. విలువైన భూములకు డోర్ నెంబర్లను జారీ చేస్తూ భారీగా దండుకుంటున్నారు. ముఖ్యంగా మున్సిపల్ కార్యాల యంలో కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఒకరిద్దరు అధికారులే ఈ దందాకు తెరలేపుతున్నట్లు తెలుస్తుంది. అసలు నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో ఇంటిని పరిశీలించిన తర్వాతనే డోర్ నెంబర్‌ను కేటాయించాలి. కానీ ఎలాంటి నిర్మాణం లేకపోయినా డోర్ నెంబర్‌ను కేటాయిస్తూ అడ్డగోలుగా దండుకుం టున్నారు. గతంలో మావల గ్రామ పంచాయతీ పరిధిలో విచ్చలవిడిగా డోర్ నెంబర్‌లను కేటాయించడం వెలుగు చూసింది. ఇప్పుడు మున్సిపల్ పరిధిలో

(తరువాయి 7వ పేజీలో...)



వెంటనే చర్యలు తీసుకుంటాం..
: సీపీఎన్ రాజు, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్



ఇల్లీగల్ వెంచర్లలో డోర్ నెంబర్లతో ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తున్న విష యం మా దృష్టికి వచ్చింది. వెంటనే చర్యలు తీసుకుంటాం. అడ్డదారిలో డోర్ నంబర్లను జారీ చేసిన అధికారిపై శాఖా పరమైన చర్యలు ఉంటాయి. అనుమతులు లేకుండా ఎవరు వెంచర్లను ఏర్పాటు చేసిన తొలగిస్తాం. ప్రజలు అన్ని రకాల అనుమతులు అన్నిరకాల అనుమతులు చూసుకున్న తర్వాతనే ప్లాట్లను కొనుగోలు చేయాలి.

రిజిస్ట్రేషన్‌లపై విచారణ : రవీందర్, జిల్లా రిజిస్ట్రార్ అధికారి ఆదిలాబాద్

ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగినట్లు మా దృష్టికి రాలేదు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తాం. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో 25/2 సర్వే నెంబర్‌లో జరిగిన రిజిస్ట్రేషన్ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.



ఇచ్చోడలో స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

25న హీరాసుక జయంతి ఉత్సవాలు

ఇచ్చోడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గోండి ధర్మగురు హీరాసుక జయంతి వేడుకలు ఈనెల 25న ఇచ్చోడలో నిర్వహించే ఉత్సవాలను విజయవంతం చేయాలని బోథ్ డివిజన్ ఉత్సవ కమిటీ ప్రధాన్ పురోహిత్ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇచ్చోడలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రధాన్ సమాజ్ సభ్యులు భారీ ఎత్తున హాజరవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలిరాం, మాడావి మారుతి, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్ డిపో నుంచి శంషాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సు

ఉట్నూర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ బస్సు డిపో నుంచి ఖానాపూర్, మెట్‌పెల్లి మీదుగా శంషాబాద్‌కు ఆర్టీసీ అధికారులు సూపర్ లగ్జరీ సర్వీసును ప్రవేశపెట్టారు. ఉట్నూర్ బస్టాండ్ నుంచి ప్రతీరోజు సాయంత్రం 4.30 బయలదేరి కడెం ఖానాపూర్‌కు 5.20 నిమిషాలకు చేరుకొని, 5.40 నిమిషాలకు పల్లి, అక్కడి నుంచి ఆర్మూర్, కామారెడ్డి, సికింద్రాబాద్ మీదుగా శంషాబాద్‌కు రాత్రి ఒంటి గంటకు చేరుకుంటుంది. తిరిగి ఉదయం 6.45 నిమిషాలకు బయలదేరి సికింద్రాబాద్ కామారెడ్డి, ఆర్మూర్, మెట్‌పల్లి, మీదుగా ఖానాపూర్‌కు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకొని, ఖానాపూర్ నుంచి బయలుదేరి ఉట్నూర్‌కు 2.45 నిమిషాలకు చేరుకుంది. ఖానాపూర్ నుంచి సికింద్రాబాద్‌కు టిక్కెట్ ధర రూ.510 ఖానాపూర్ నుంచి శంషాబాద్‌కు టికెట్ ధర రూ.540 దస్తురాబాద్, కడెం, పెంబి, ఖానాపూర్, మండలాల ప్రజలకు బస్సు సేవలు ఉపయోగంలోకి రానున్నాయి.



హస్నాపూర్‌లో పాల్గొన్న గ్రామస్థులు

అఖండ హరినామ సప్తాహ ప్రారంభం

ఉట్నూర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాపూర్‌లోని హనుమాన్ మందిరంలో అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యనాథ్ మౌళి మహరాజ్, సుందర్‌సింగ్ నర్సింగ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో బుధవారం సంగీత తాయి, నాగ్‌నాథ్ గోవింద ఉపదేశాలు ఇచ్చారు. ఈనెల 25వరకు జరగనున్న సప్తాహలో మాణిక్ మహరాజ్, మారుతి మహరాజ్, రూపాలితాయి, ప్రశాంత్ మహరాజ్ లతో కీర్తనలు ఉంటాయని, అలాగే పలువురు మహరాజ్‌లతో ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాదవ్ ఉపేందర్, జ్ఞానోబా, కిరణ్, ఆనంద్ సతీష్, మాజీ ఉపసర్పంచ్ అశోక్, రాందాస్, తుకారాం, వీరభద్ర, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



బోథ్‌లో పాల్గొన్న ఎస్సై, ఆరె మరాఠ సంఘ సభ్యులు



బోథ్‌లో పాల్గొన్న స్థానిక యువకులు



నేరడిగొండలో వేడుకలు నిర్వహిస్తున్న యువకులు



నార్నూర్‌లో వేడుకలను నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

● జిల్లావ్యాప్తంగా వేడుకల్లో పాల్గొన్న నాయకులు, యువకులు

బోథ్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బోథ్, సోనాల మండల కేంద్రాలలో బుధవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బోథ్ మండల కేంద్రంలో ఆర్ఎంఆర్ ఆరే సంఘం అధ్యకుడు విట్టల్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను జరుపుకున్నారు. శివాజీ విగ్రహం వద్ద చిత్రపటాన్ని పెట్టి జెండాను ఎగురవేసిన అనంతరం జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ప్రవీణ్ కుమార్‌తో పాటు ఆరే సంఘం సభ్యులు ఏం రాజారామ్, ఎస్ రాజారాం, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, కె.ముకుంద్, కే.సాంబాజి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, సోనాల మండల కేంద్రంలో శివాజీ చౌక్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శివాజీ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం పూలమాలలు వేసి జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు శివాజీ మహరాజ్ ధైర్యాన్ని పరిపాలన ఆయన గొప్పతనాన్ని హైందవ ధర్మ రక్షణ కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల వాసులు పాల్గొన్నారు.

అలాగే, మండల కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో బుధవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ శివాజీ మరాఠా హిందూ సామ్రాజ్యానికి పునాది వేసిన గొప్పరాజు అని పేర్కొన్నారు. అతని హయాంలో హిందూ సంస్కృతిని పరిరక్షించడం జరిగిందన్నారు. ఆయన చేసిన ధైర్యసాహసాలు నేటి యువతకు ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని ఉట్నూర్ మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని ఉట్నూర్, షాంపూర్, హస్నాపూర్‌లలో శివాజీ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌లో హిందూ ఉత్సవ సమితి శివాజీ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 395వ జయంతి ఉత్సవాలు నిర్వహించగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరై శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివాజీ మహరాజ్ యొక్క అడుగు జాడలలో యువత నడుచుకోవాలని ఆయన ఆశయాలను యావత్ ప్రజలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు ఆర్యన్ మహరాజ్, బీజేపీ రాష్ట్ర యువ నాయకులు రితేష్ రాథోడ్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు కొండేరి రమేష్, అరికెళ్ల అశోక్, మర్సకోలా తిరుపతి, టేకం హరి ప్రసాద్, ఠాకూర్ గోపాల్ సింగ్, అక్షింతల తిరుపతి, కొండగట్టు అంజన్న, రామగిరి శ్రీనివాస్, సూర్యవంశీ కిరణ్, యెగేష్ తదితర హిందూ సంఘాల నాయకులు ఉట్నూర్ పట్టణ ప్రజలు పాల్గొన్నారు. షాంపూర్‌లో జరిగిన శివాజీ జయంతి కార్యక్రమంలో శివాజీ విగ్రహానికి మాజీ సర్పంచ్ గుండాల మల్లిక, మాజీ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, మాజీ ఎంపీటీసీ కందుకూరి రమేష్, కాటం రమేష్ హాజరై నివాళులర్పించారు.



ఉట్నూర్‌లో నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు



తాంసిలో శివాజీకి పూజలు చేస్తున్న నాయకులు

తాంసి: మండలకేంద్రంలో బుధవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. బస్టాండ్ వద్ద ఉన్న శివాజీ మహరాజ్ విగ్రహానికి శివసేన యూత్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేత లోక ప్రవీణ్‌రెడ్డి, కృష్ణ, మంత్రి రాజు, తదితరులు ఉన్నారు.

నేరడిగొండ: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని నేరడిగొండ హిందూవాహిని, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి జయంతిని ఘనంగా జరుపుకోవడానికి సహకరించిన చేసిన ప్రతి హిందూ బంధువుకు హిందూ సంఘాల తరఫున ప్రత్యేక ధన్యవాదాములు తెలిపారు.

ఆదిలాబాద్ రూరల్: ఛత్రపతి శివాజీ మహారాజ్ యుగ పురుషుడని అందరి సంక్షేమం కోసం పాటు పడ్డారని ఆరె మరాఠ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దశరథ్ పటేల్ అన్నారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శివాజీ చౌక్‌లోని ఆయన విగ్రహానికి ఉదయం క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించి విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆరె మరాఠ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దత్త్రాత్రే ద్రోణలే, కోశాధికారి రాజు షిండే, తనాజీ నిక్కం, పట్టణ అధ్యక్షులు గోవిందావ్ సోమాసే స్నేహల్, ఆనందావ్ అవినాశ్, యోగేష్ పాల్గొన్నారు. ఇదిలా ఉంటే అటూ సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చౌక్‌లోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, సభ్యులు రేనికుంట్ల రవీందర్, ఉరడే సుభాష్, కందుల రవీందర్, మర్శెట్టి రాజు పాల్గొన్నారు. మరో పక్క బీజేపీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చౌక్‌లోని శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. సనాతన ధర్మ రక్షణలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటు నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మనంద్, వేదావ్యాస్, తదితరులు పాల్గొన్నారు.

● శివాజీ జయంతికి సెలవు ప్రకటించాలి

నార్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి రోజున జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బిక్కు రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక గాంధీచౌక్ వద్ద హిందూ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహరాజ్ చిత్రపటానికి పూలమావేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగల్ సామ్రాజ్యం నుంచి దేశాన్ని కాపాడిన మహనీయుడు అన్నారు ఇందులో జిల్లా కార్యవర్గ సభ్యులు చాలూర్కర్ ప్రకాష్, జిల్లా నాయకులు జ్ఞానేబా పుష్కర్, రాహుల్, మహేందర్, సావన్ శ్రీకాంత్, తదితరులున్నారు.

బజార్‌హత్నూర్: మండలకేంద్రంలోని హిందూ వాహిణి, బజరంగ్‌దల్, హిందూ బంధువుల అందరి సమక్షంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని శివాజీ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి జెండాను ఎగురవేశారు. శివాజీ మొగలులతో ఎన్నో యుద్ధాలు చేపి అఖండ హిందూ సామ్రాజ్యాన్ని నిర్మించాడన్నారు. అనంతరం మండలంలోని పలు ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువకులు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

ముగిసిన బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు

7లో

- వైభవంగా శ్రీనివాస కల్యాణం
- గోవింద నామస్మరణతో మార్మోగిన తలమడుగు

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

● జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్ రావు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గం ద్వారా కేసుల పరిష్కరం కోసం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు కోరారు. బుధవారం జిల్లా కోర్టులోని ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మార్చి 8న నిర్వహించే లోక్ అదాలత్ వివరాలను డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్యతో కలిసి వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ పెండింగ్ కేసుల్లో రాజీపడ దగ్గ కేసులను పరిష్కరించేలా లోక్ ఆదాలత్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. మార్చి 8న జిల్లావ్యాప్తంగా కోర్టుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అదాలత్ కొనసాగుతుందన్నారు. రాజీ మార్గం ద్వారా సమస్యల శాశ్వత పరిష్కరం పొందాలని కోరారు. ఇలాంటి అవకాశాలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్ రావు